# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విజయవాడలో జరుగుతున్న గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్ఫర్మేషన్ టూరిజం కాన్ క్లేవ్ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.**
2. **ఏడాది కాలంలో రాష్ట్రంలో ఏడు పర్యాటక ప్రాజెక్టులకు సహాయం అందించినట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు.**
3. **ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కీలకపాత్ర పోషిస్తాయని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.**
4. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

విజయవాడలో జరుగుతున్న గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్ఫర్మేషన్ టూరిజం కాన్ క్లేవ్ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పర్యాటక క్యారావాన్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో 10 వేల 39 కోట్ల రూపాయల పెట్టుబడులపై రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..

..వాయిస్…32

--------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యహ్నం గుంటూరులోని ఆర్‌వీఆర్ & జేసీ కళాశాలలో నిర్వహించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఏపీ పోలీస్ – హ్యాకథాన్ 2025 కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఈ సాయంత్రం పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలో జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలిస్తారు.

--------------------------

ఏడాది కాలంలో రాష్ట్రంలో ఏడు పర్యాటక ప్రాజెక్టులకు సహాయం అందించినట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. విజయవాడలో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన "కాంగ్రెస్ విధించిన అత్యవసర పరిస్థితి–చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు" సదస్సులో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా

కేంద్రమంత్రి మాట్లాడుతూ.. పెహల్గాంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు. కశ్మీర్‌లో పర్యాటకం క్రమంగా పెరుగుతోందని వివరించారు.

...వాయిస్ ..32 సెకన్లు

---------------------------

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కీలకపాత్ర పోషిస్తాయని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తిరుపతిలో ప్రపంచ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో డిమాండ్ ఉన్న ప్రత్యేక ఉత్పత్తులు, హస్తకళల విక్రయాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. విశ్వకర్మయోజన ద్వారా సబ్సిడీ కింద రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు.

---------------------------

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు అంశంపై 7 నుంచి 10 రోజుల్లోపల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో సమావేశం కాబోతున్నట్లు కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. పదకొండు సంవత్సరాల ఎన్డీయే పాలనలో జల శక్తి శాఖ సాధించిన విజయాలపై ఆయన నిన్న ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నదుల్లో జలాలకు సంబంధించిన విషయాలపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు కొంత సమయం పడుతుందని, అయినప్పటికీ అంతిమంగా సమస్యలకు పరిష్కార మార్గాలు లభిస్తాయని కేంద్రమంత్రి పేర్కొంటూ..

... వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

నెల్లూరులో అన్ని పార్కులనూ ఆధునీకరించి అభివృద్ధి చేస్తున్నట్లు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో 50 లక్షల రూపాయలతో ఆధునీకరించిన చెరుకు తోట పార్కును మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రెండు రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్ ఇచ్చేందుకు ఎన్టీఆర్ సుజల సురక్ష పథకాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా చేయనున్నట్లు స్పష్టం చేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

విశాఖపట్నం, విజయవాడలో ఈ-పాస్‌పోర్టుల సదుపాయం అందుబాటులో ఉందని ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి కె. శివ హర్ష తెలిపారు. విజయవాడలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. ఈ -పాస్‌పోర్టుల ద్వారా నకిలీ వాటిని అదుపు చేయవచ్చని తెలుపుతూ..

..వాయిస్...28 సెకన్లు

----------------------------

భారత స్వాతంత్ర్య సాధన కాంక్షను, దేశభక్తి స్ఫూర్తిని ప్రజల్లో రగిలింపచేసిన వందేమాతరం గీత రచయిత బంకించంద్ర ఛటర్జీ జయంతి ఈరోజు. 1838 జూన్ 27వ తేదీన జన్మించిన ఈ బెంగాలీ కవి... వందేమాతరం గీత రచన ద్వారా భారత ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారు. ఛటర్జీ రాసిన "ఆనంద్ మఠ్" నవల్లోని వందేమాతరం గీతం స్వతంత్ర్య సంగ్రామంలో సమర శంఖమయ్యింది. భారతదేశపు ఔనత్యాన్ని తెలియజేస్తూ రాసిన ఆనంద్ మఠ్ పుస్తకంలో వందేమాతరం గేయాన్ని సంస్కృతంలో రచించారు. భారత స్వరాజ్య సంగ్రామంలో జాతి జనుల్ని ఉత్తేజపరచి, వందేమాతర గీతంతో భారతావని మొత్తాన్ని ఏకం చేసిన బంకించంద్ర చటర్జీ, 1894వ సంవత్సరం ఏప్రిల్ 8వ తేదీన తుదిశ్వాస విడిచారు.

----------------------------

అనకాపల్లి జిల్లాలోని కసింకోట మండలం ఉగ్గినపాలెం సమీపంలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరి మృతి చెందారు. ఈ ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గాయపడిన మహిళకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు మంత్రి సూచించారు.

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మీ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్... 29 సెకన్లు

----------------------------

రాష్ట్రంలోని పాఠశాలల్లో జులై 5వ తేదీన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 74 లక్షల 96 వేల మంది విద్యార్థులు, 3 లక్షల 32 వేల మంది ఉపాధ్యాయులు, కోటి 49 లక్షల మంది తల్లిదండ్రులు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర పురోగతి కార్డులను ఆ రోజు జరిగే కార్యక్రమంలో అందజేయనున్నట్లు వెల్లడించారు.

=====================